క్లుప్తంగా

ఉక్కుదీక్ష భగ్నం అప్రజాస్వామికం

గుమ్మలక్ష్మీపురం: విశాఖ ఉక్కు కర్మాగారం ఒప్పంద ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షను పోలీసులు ఒక్కరోజులో భగ్నం చేయడం సరికాదని ఆ పార్టీ నియోజక వర్గ కో–ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు మండిపడ్డారు. రెండు వేల మంది కార్మికులను అన్యాయంగా తొలగిస్తే వారి వైపు నిలబడి న్యాయం కోసం పోరాడడం తప్పా అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్య పంథాలో చేపట్టిన దీక్షను భగ్నం చేసి, షర్మిలను బలవంతంగా విశాఖ నుంచి హైదరాబాద్‌కు హుటాహుటిన తరలించడం సీఎం చంద్రబాబు నియంత పాలనకు అద్దం పడుతోందని దుయ్యబట్టారు. ప్రధాని మోదీ అండతోనే రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఇటువంటి దుశ్చర్యలకు ఒడిగడుతోందని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యాన్ని అపహసించే చర్యలతో ఎన్నాళ్లో అధికారాన్ని శాసించలేమనే సత్యాన్ని కూటమి ప్రభుత్వం గ్రహించాలని హితవు పలికారు.

వినతిపత్రం అందజేత


తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

గరుగుబిల్లి: ఎండీయూ వ్యవస్థ నిలిపివేస్తున్న కారణంగా తమకు ఉపాధి మార్గం చూపించి న్యాయం చేయాలని ఎండీయూ ఆపరేటర్లు కోరుతున్నారు. ఇదే విషయమై మండల కేంద్రంలో తహసీల్దారు పి.బాలను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎండీయూ వాహనాలను తీసివేయడంతో ఆ వాహనాలపై ఆధారపడి జీవిస్తున్న 18.500 కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. అలాగే తాము ఇన్సూరెన్స్ నిమిత్తం చెల్లించిన రూ.9 వేలు, అలాగే విజయవాడ వరద బాధిత ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఎటువంటి డబ్బులు ఇంత వరకు ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా ఆ డబ్బులు చెల్లించి, తమకు ఉపాధి అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించాలి


న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న అధ్యక్షురాలు హరిప్రియ

పాలకొండ రూరల్: స్థానిక కోర్టు ఆవరణలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ అధ్యక్షురాలు చెందక హరిప్రియ సమక్షంలో శనివారం న్యాయ విజ్ఞానసదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జూలై 5న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ మార్గంలో పరిష్కరించాలని సూచించారు. మహిళలు పనిచేసే చోట జరిగే లైంగిక వేధింపులపై అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న తహసీల్దార్ సత్యనారాయణ, వీఆర్ఓలు, సర్వేయర్లు

వీరఘట్టం: ప్రతి వారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జేసీ శోభిక ఆదేశించారని తహసీల్దార్ చందక సత్యనారాయణ తెలిపారు. శనివారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ మాట్లాడుతూ.. పలు సమస్యలపై దిశానిర్దేశం చేసిందని చెప్పారు. అలాగే రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలన, రీ సర్వే, తదితర అంశాలపై మాట్లాడినట్లు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక రెవెన్యూ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల పునఃప్రారంభం రోజే విద్యార్థి మిత్ర కిట్లు

గరుగుబిల్లి: పాఠశాలల పునఃప్రారంభం రోజే విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు ఏఎంఓ జి.కోటేశ్వరరావు తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చేరిన కొత్త పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు, షూలను ఆయన శనివారం పరిశీలించారు. వసతులు అరకొరగా ఉన్న పాఠశాలల్లో మెరుగుకు చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు.

వైభవంగా సింహాద్రి అప్పన్న సంబరాలు

వీరఘట్టం: మండలంలోని నడుకూరులో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సింహాద్రి అప్పన్న సంబరాలు వైభవంగా సాగాయి. లెంక వంశీకులు నిర్వహించిన ఈ సంబరాల్లో శనివారం ఏర్పాటు చేసిన తప్పెటగుళ్లు, హరికథ ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. మహిళలు స్వామి వారికి పూజలు చేశారు.


తలుపుల్లేని మరుగుదొడ్లు ఇలా..


బెడ్లు లేని మంచాలు..


బీజేపురం హాస్టల్ భవనం

వసతులు కరువు!

జియ్యమ్మవలస మండలం, బీజేపురం బాలురు వసతిగృహం పరిస్థితి అధ్వానంగా ఉంది. హాస్టల్ పరిసరాలు చెత్తాచెదారం, పిచ్చిమొక్కలతో నిండిపోగా, లోపలి ప్రదేశాలు కూడా అపరిశుభ్రంగానే ఉన్నాయి. దీనికితోడు విద్యార్థులకు అవసరమైన కనీస వసతులు ఏవీ లేవు. రన్నింగ్ వాటర్ సదుపాయం లేకపోగా, బెడ్లు, బెడ్‌షీట్లు లేని మంచాలు కనిపిస్తున్నాయి. వీటికి తోడు అక్కడి ఏ ఒక్క మరుగుదొడ్డికీ తలుపుల్లేవు. దీంతో బకెట్లతో నీరు పట్టుకుని, ఆరుబయటకు బహిర్భూమికి వెళ్లాల్సిన దుస్థితి. ఇలా వెళ్లినప్పుడు ఏదైనా విషసర్పం కాటేస్తే ఏంటి పరిస్థితి అని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా పట్టించుకునే నాథుడే లేడని, కనీసం పాఠశాలల పునఃప్రారంభం నాటికైనా వసతుల కల్పనపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

–జియ్యమ్మవలస రూరల్

యార్డు ఉన్నా ఫలితం సున్నా..

- నిరుపయోగంగా మార్కెట్ యార్డు స్థలం
- సీఎస్పీ రోడ్డు పక్కనే ఉన్న 6.5 ఎకరాల భూమి
- దీని విలువ సుమారు రూ.30 కోట్లు
- లీజుకు ఇస్తే ప్రతీ నెలా ప్రభుత్వానికి రూ. లక్షల్లో ఆదాయం
- ఎవరూ పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం


నిరుపయోగంగా ఉన్న మార్కెట్ యార్డు గోదాములు

వీరఘట్టం:

రైతుల ప్రయోజనం కోసం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పక్కన, సీఎస్పీ రోడ్డుకు ఎదురుగా నిర్మించిన మార్కెట్ యార్డు మూడు దశాబ్దాల కాలంగా నిరుపయోగంగా ఉంది. ఈ స్థలాన్ని లీజుకు ఇచ్చినా లేదా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించినా ప్రతి నెలా రూ.లక్షల్లో ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అయితే ఎవరూ పట్టించుకోకపోవడంతో రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసంగా మారింది. 30 సంవత్సరాల కిందట రూ.8 లక్షల (ప్రస్తుతం విలువ సుమారు రూ. 30 కోట్లు) వ్యయంతో 6.5 ఎకరాల విస్తీర్ణంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ నిర్మించారు. రెండు గోదాంలు, విశాలమైన రెండు రేకుల షెడ్లు, పంటలను ఆరబెట్టుకునేందుకు మరో రెండు షెడ్డులు నిర్మించారు. ప్రస్తుతం ఈ షెడ్డులు, ఖాళీ స్థలం మార్కెట్ యార్డులో నిరుపయోగంగా మారాయి.

మూడు రోజుల ముచ్చటగా...

ప్రజల కోరిక మేరకు 13 ఏళ్ల కిందట ఇక్కడ వారపు సంత ఏర్పాటు చేశారు. అయితే ఈ సంతను కొనసాగించడంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో దళారులు చాపకింద నీరులా వ్యవహరించి సంతను నిర్వీర్యం చేశారు. ఇక్కడ ఏర్పాటు చేసిన సంత మూడు రోజుల ముచ్చటగా ముగిసింది. వీరఘట్టం మండలం కాయగూరలు, ఇతర పంటలకు ప్రసిద్ధి. ఈ ప్రాంతంలో పండుతున్న అరటి, మొక్కజొన్న, కాలీఫ్లవర్, క్యాబేజీ, టమాటా, దొండ, బెండ, క్యాబేజీ, క్యారెట్, తదితర పంటలకు ఇతర ప్రాంతాల్లో ఎంతో గిరాకీ ఉంది. స్థానికంగా విక్రయించేందుకు మార్కెట్ సదుపాయం లేకపోవడంతో దళారుల ప్రమేయం అధికంగా కనిపిస్తోంది.


సీఎస్పీ రోడ్డు పక్కన ఖాళీగా ఉన్న విలువైన మార్కెట్ యార్డ్ స్థలం

నిరుపయోగం....

ప్రస్తుతం మార్కెట్ యార్డ్‌లో ఉన్న రెండు గోదాములు నిరుపయోగంగా మారాయి. బయట వ్యక్తులకు అద్దెకు ఇచ్చినా రూ.లక్షల్లో ప్రభుత్వానికి ఆదాయం వచ్చేది. గత టీడీపీ హయాంలో గోదాంల మరమ్మతులకు రూ.లక్షలు ఖర్చు చేశారు కాని ఉపయోగంలోకి మాత్రం తీసుకురాలేదు. మెయింటినెన్స్ పేరిట నిధులు వృథా అవుతున్నాయే తప్ప ప్రభుత్వానికి, రైతులకు ఈ గోదాముల వల్ల ఎటువంటి ఉపయోగం లేదు. ఇప్పటికైనా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు స్పందించి మార్కెట్ యార్డ్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

జోరుగా ఆక్రమణలు....

ప్రభుత్వ స్థలం కావడంతో అడిగే నాథుడు లేకపోవడంతో కొంతమంది ఆక్రమించుకుని షెడ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేస్తున్నారు. ఇంకొందరు ఆక్రమించుకున్న షెడ్డులను అద్దెలకు ఇచ్చుకుని దర్జాగా దర్పం చెలాయిస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో వేసిన షెడ్డులకు ఎటువంటి ఆధారాలు లేకపోయినా విద్యుత్ శాఖాధికారులు ఎలా మీటర్లు మంజూరు చేశారో అర్థం కావడం లేదు. ఇలానే వదిలేస్తే మరికొద్ది రోజుల్లో పక్కా భవనాలు నిర్మించే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి ఆక్రమణలు తొలగించి, యార్డును వినియోగంలోకి తీసుకురావాలని పలు వురు కోరుతున్నారు.

రాకపోకలకు మార్గం సుగమం


జేసీబీతో చెట్టు కలపను పక్కకు నెట్టివేయిస్తున్న పోలీసులు

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చినమేరంగి గ్రామ హరిజన వాడ దగ్గరలో రోడ్డుపై ఓ భారీ వృక్షం శుక్రవారం అర్ధరాత్రి వీచిన భారీగాలులకు నేలకూలింది. దీంతో పాలకొండ నుంచి జియ్యమ్మవలస మీదుగా కురుపాం, గుమ్మలక్ష్మీపురం ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న చినమేరంగి సీఐ టీవీ తిరుపతిరావు, ఎస్ఐ పి.అనీష్‌లు జేసీబీ ఏర్పాటు చేయించి, రోడ్డుకు అడ్డంగా ఉన్న వృక్షాన్ని తొలగించి, ముక్కలు ముక్కలు చేసి పక్కనే భద్రపరిచారు. శనివారం ఉదయం నుంచి ఆ రోడ్డులో ప్రయాణికులు, వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి.

పరామర్శ


రాయగడజమ్ములో బాధిత కుటుంబానికి ధైర్యం చెబుతున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రాయగడ జమ్ము గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు పువ్వల మోహనరావును, చినవంకధార గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత కిల్లక చెన్నయ్యను మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి శనివారం పరామర్శించారు. మోహనరావు తల్లి సుందమ్మ, చెన్నయ్య కొడుకు రౌతు ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆమె.. శనివారం ఆయా గ్రామాలకు వెళ్లి బాధిత కుటుంబాలను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ పరంగా అండగా ఉంటామని ధైర్యంగా ఉండాలని భరోసా నిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కుంబురుక దీనమయ్య, వైస్ ఎంపీపీలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు గోరిశెట్టి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లిలో పాలక గంగయ్య అనే వ్యక్తి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం పాముల పుష్పశ్రీవాణి ఆ గ్రామం వెళ్లి, బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట మండల కన్వీనర్ కె.అచ్యుతరావు, నాయకులు కన్నయ్య, వాసునాయుడు తదితరులు ఉన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పనిచేయాలి


కురుపాంలో పోలీసులకు సూచనలిస్తున్న పాలకొండ ఎస్‌డీపీవో రాంబాబు

గుమ్మలక్ష్మీపురం: శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం కావాలని, ఆ దిశగా విధులు నిర్వహించాలని పాలకొండ ఎస్‌డీపీవో ఎం.రాంబాబు పోలీసులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మండలంలోని ఎల్విన్‌పేట, కురుపాం మండల పోలీస్‌స్టేషన్లను ఆయన శనివారం సందర్శించారు. ఆయా స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలతో పాటు పరిష్కరించిన కేసులను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. మావోయిస్టుల అలజడి ఉన్నందున అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అపరిచిత వ్యక్తులపై నిఘా ఉంచాలన్నారు. పక్కాగా ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయాలన్నారు. సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ఎల్విన్‌పేట సీఐ బి.హరి, ఎస్ఐలు బి.శివప్రసాద్, పి.నారాయణరావు తదితరులు ఉన్నారు.

అధిక రక్తపోటు నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

జియ్యమ్మవలస రూరల్: ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జియ్యమ్మవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) వైద్యాధికారి పి.జగదీష్ సూచించారు. ప్రపంచ అధిక రక్తపోటు నివారణ దినోత్సవంలో భాగంగా మండల కేంద్రంలో పీహెచ్‌సీ పరిధిలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక రక్తపోటుకు కారణాలు, నివారణ చర్యలను వైద్య సిబ్బంది తెలిపారు. మనం రోజువారీ తీసుకునే ఆహారంలో జాగ్రత్తలు పాటించాలని, ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకునేలా ఉండాలన్నారు. రక్తపోటు మనిషిలో అంతర్గత శత్రువుగా మెలుగుతూ ఒక్కసారిగా మనిషి మరణానికి కారణమవుతుందన్నారు.

భక్తుల మొక్కుల చెల్లింపు

గరుగుబిల్లి: మండల పరిధిలోని తోటపల్లి దేవస్థానంలో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామి, పద్మావతి అమ్మవార్లను భక్తులు శనివారం దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం సుప్రభాత సేవ, మంగళాశాసనం, శాత్తుమురై, తీర్థఘోష్టి తదితర పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. అనంతరం పుట్టదేవుని వద్దకు వెళ్లి, పూజలు చేశారు. ఆ తర్వాత తలనీలాలు సమర్పించారు.

29న మండల సర్వసభ్య సమావేశం

గరుగుబిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 29వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లంతా హాజరవుతున్నారని, అధికారులంతా ప్రగతి నివేదికలతో రావాలని కోరారు.

సారా రహిత గ్రామంగా 'రజ్జలి'

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండలంలోని ఏగులవాడ పంచాయతీ, రజ్జలి గ్రామాన్ని సారా రహిత గ్రామంగా కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు శనివారం ప్రకటించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమై ఇదే స్ఫూర్తిని కొనసాగించి, ఎప్పటికీ సారా లభ్యం కాని గ్రామంగానే ఉండాలని, అలాగే ఉంచాలని గ్రామపెద్దలను కోరారు. నవోదయం 2.ఓ కార్యక్రమంలో భాగంగా పలుమార్లు సారా నిర్మూలనపై కల్పించిన అవగాహన కార్యక్రమాల ఫలితమే ఇది అని, సారాకు దూరంగా ఉన్నందుకు గ్రామస్తులను అభినందించారు. గత మూడు నెలలుగా గ్రామంలో సారా తయారీ గానీ విక్రయాలు గానీ తరలింపు గానీ జరగలేదని, అలాగే సారా విక్రయాలు జరుగుతున్నట్లు మహిళలు, గ్రామస్తుల నుంచి ఎటువంటి ఫిర్యాదు అందకపోవడంతోనే గ్రీన్(సారా రహిత) గ్రామంగా ప్రకటించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో అధికారి వై.కొండలరావు, సర్పంచ్ పి.భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు తయారు చేయండి


గొట్టివలస ఎస్‌డబ్ల్యూపీసీలో ఎరువుల తయారీని పరిశీలిస్తున్న ఎంపీడీవో పైడితల్లి

గరుగుబిల్లి: ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త సంపద తయారీ కేంద్రాలు)ల్లో సేంద్రియ ఎరువుల తయారీకి చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జి.పైడితల్లి సూచించారు. మండలంలోని గొట్టివలస గ్రామ ఆదర్శ చెత్త సంపద కేంద్రాన్ని ఆమె శనివారం ప్రారంభించారు. గ్రామంలోని ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను తడిచెత్త, పొడిచెత్తగా వేరు చేసి ఇక్కడికి తరలించి వాటి ద్వారా ఎరువు తయారు చేయాలన్నారు. ఇక్కడ తయారైన ఎరువును సబ్సిడీ(రాయితీ)పై రైతులకు అందించి, పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చాలని ఆమె తెలిపారు. ఆమె వెంట డిప్యూటీ ఎంపీడీవో సీహెచ్ వెంకట కుర్మినాయుడు, డీపీఆర్‌సీ ఎ.గణపతి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే మద్యం విక్రయాలు


నిర్వాహకులకు సూచనలిస్తున్న ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): నిబంధనల మేరకే మద్యం విక్రయాలు చేయాలని సీఐ పి.శ్రీనివాసరావు సూచించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఎస్‌వీవీఎన్ బాబ్జీరావు ఆదేశాల మేరకు కురుపాంలోని మద్యం దుకాణాలను శనివారం తనిఖీ చేసి నిర్వాహకులకు సూచనలు చేశారు. దుకాణాలన్నీ ఉదయం 10 గంటలు నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే నిర్వహించాలని, ఎంఆర్‌పీ ధరల కన్నా ఎక్కువకు మద్యం విక్రయించొద్దన్నారు. మద్యం షాపుల నిర్వాహకులు నిబంధనలు అమలు చేస్తున్నదీ లేనిదీ పరిశీలించేందుకు పెట్రోలింగ్ టీమ్‌లను ఉన్నతాధికారులు నియమించారన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

భవనాన్ని ప్రారంభించేదెప్పుడో..?


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సమీకృత వసతిగృహ భవనం

వీరఘట్టం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం పక్కనే నిర్మించిన సమీకృత బాలికల వసతిగృహం నిర్మాణ పనులు ఇటీవల పూర్తయ్యాయి. ఈ ఏడాది జూన్ నెల నుంచి వసతిగృహం అందుబాటులోకి రానుందని అధికారులు చెబుతున్నారు. వీరఘట్టం జిల్లా పరిషత్ హైస్కూల్‌తో పాటు బాలికల ఉన్నత పాఠశాలల్లో చదివే బాలికలకు ఇక్కడ వసతి కల్పించనున్నారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బాలికలకు వసతి కల్పిస్తారని అధికారులు చెబుతున్నారు. భవనం నిర్మాణ పనులు పూర్తయ్యాయి గాని ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి భవనాన్ని త్వరగా ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

ధర్నా పోస్టర్ల ఆవిష్కరణ

పాలకొండ: తోటపల్లి ఎడమ కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందించాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28న చేపట్టనున్న ధర్నాకు సంబంధించిన పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. రైతు సంఘ ప్రతినిధులు పలు గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా రైతు సంఘ జిల్లా ఉపాధ్యాక్షుడు బంటు దాస్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రైతులకు సాగునీరు అందించడంలో విఫలమైందని ఆరోపించారు. ఏడాదిగా సాగునీటి కోసం పోరాటం చేస్తున్నా నాయకులు, అధికారుల్లో చలనం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు అందించాలని కోరుతూ ఈ నెల 28న పాలకొండలో ర్యాలీ నిర్వహించి సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు తెలిపారు. రైతలందరూ ధర్నాలో పాల్గొనాలని కోరారు.


ధర్నా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రైతు సంఘ ప్రతినిధులు

సైనికులకు మద్దతుగా ర్యాలీ


భారతదేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా పట్టణంలో మహిళలు శనివారం ర్యాలీ నిర్వహించారు. వీరఘట్టం సెంటర్ నుంచి కోటదుర్గమ్మ ఆలయం మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు ర్యాలీ చేపట్టి భారత సైనికులకు మద్దతు పలికారు. పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి మహిళలు ర్యాలీలో పాల్గొని జై భారత్ అంటూ నినాదాలు చేశారు. – పాలకొండ

రహదారి ఇలా.. రాకపోకలెలా..!


సీతంపేట మండలంలోని మారుమూల గ్రామమైన సారంగ గ్రామానికి వెళ్లే రహదారి బురదమయమైంది. రోలుగుడ్డి నుంచి సారంగికి వెళ్లే మార్గం కొద్ది పాటి వర్షానికే పూర్తిగా అధ్వానంగా మారుతోంది. కనీసం నడవడానికి కూడా వీల్లేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి రహదారిని అభివృద్ధి చేయాలని పలువురు కోరుతున్నారు. – సీతంపేట